# సూపర్‌మేన్-IV
## ది టెలుగు మూవీ

గత సంచిక తరువాయి

బామ్మర్దితను గురించి వివరంగా చెప్పాడు. అంతా చెప్పి- "అవును గానీ... మీరేమిటి ఇలా?" అని బాధపడ్డారు ఇద్దరూ.

సూపర్‌మేన్ నిట్టూర్చి, "ఏం చెయ్యమంటారు? అన్ ఎంప్లాయిమెంట్ ప్రాబ్లెమ్. ఇంకోళ్ళ మీద ఆధారపడి బతకడం నాకిష్టం లేదు. అందుకని ఇక్కడికొచ్చి షటిల్ సర్వీసు చేసుకుంటూ నా గాలిలో నేను నిలబడి నా పొట్ట నేను పోషించుకుంటున్నాను" అన్నాడు.

"అసలు మీరు ఇలా అయిపోవడానికి కారణం?" అని అసామీ అంటూంటే-

"ఎలా అయిపోయాను? డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే మీ ఇండియన్స్‌కి పొత్తిగా తెలీదనుకుంటాను" అన్నాడు చిరుకోపంగా.

"అబ్బే... మా ఉద్దేశం... అంత గొప్ప వారు ఇక్కడికొచ్చి పెటేలయ్యా రేమిటే అని..." అని సర్దేసాడు బామ్మర్ది.

"చెప్తాను. మీకు చెప్పి నా బరువు కొంత దించుకోవాలని నాకూ వుంది" అంటూంటేనే బస్టాండు బయట ఇందాక చూసిన బ్రోకరు కుర్రాడు ముగ్గురు పాసింజర్లను తెచ్చి సూపర్‌మాన్ భుజాల మీద ఎక్కించబోయాడు. సూపర్‌మాన్ విసుక్కున్నాడు. "నాకోసం ప్రొడ్యూసర్లు వచ్చారు. ఓ రెండు గంటలు దాకా పాసింజర్లని బుక్ చెయ్యకు" అన్నాడు. ఆ కుర్రాడు కయ్యుమని లేచాడు. "పొద్దుట్నించీ గొంతు చించుకొని అరుస్తుంటే మూడు టిక్కెట్లు దొరికాయ్. మీకేం... నా బ్రోకరేజి నాకు లాస్" అన్నాడు గట్టిగా. సూపర్‌మేన్ ఏమీ అనలేక చిక్కమొహం వేసుకున్నాడు.

ఆ అద్భుతాన్ని కళ్ళారా చూసిన దింపేసి పంపించేశాడు. బ్రోకరు గొణుక్కుంటూ వెడుతుంటే వాడికో పది రూపాయిలిచ్చి పంపేశాడు.

సూపర్‌మేన్ కృతజ్ఞతగా చూసి తన కథ చెప్పసాగాడు.

సూపర్‌మేన్ చెప్పిన కథ

మూడు ఎపిసోడ్లూ అయిపోయాయి. నాలుగోది తియ్యటానికి ప్రొడ్యూసర్లెవరూ రాలేదింతవరకూ. వరండాలో కుర్చీ వేసుకుని ప్రొడ్యూసర్ల కోసం ఎదురు చూస్తూ కూర్చోవడం ఆ వీథిలో అందరికీ నవ్వులాటగా తయారైందని గమనిస్తూనే వున్నాడు తను.

"పోనీ మళ్ళీ ఆ పత్రికాఫీసుకి వెళ్ళి ఉద్యోగం అడగరాదా" అని ఒకళ్ళిద్దరు సలహా కూడా ఇచ్చారు.

కానీ తనకే ఇష్టం లేదు. షూటింగుల్లో పగలనకా రాత్రనగా పనిచేసి అదే పనిగా నాగాలు పెడితే ఆ ఉద్యోగం వూడింది. ఇప్పుడు మళ్ళీ ఏ మొహం పెట్టుకుని ఉద్యోగం ఇవ్వండని అడుగుతాడు!

ఒక రోజు సూపర్‌మాన్ పెరట్లో కూర్చుని గోళ్ళు గొరుక్కుంటుంటే పక్కింటి ముసలావిడ పెద్దగా గొణుక్కోవడం వినిపించింది. మొదట అర్థంకాలా తర్వాత పనిమనిషి చెప్తే తెలిసింది.

పక్కింటి వాళ్ళ కొబ్బరి చెట్టు ఏటవాలుగా పెరిగి, పై సగ భాగం తమ పెరట్లోకి వుంది. ఆవిడ రోజూ కాయలు లెక్కపెట్టుకుంటుందిట. మొత్తం నలభై ఎనిమిది కాయలకీ ఈ రోజు లెక్కపెడితే నలభై ఆరే వున్నాయట. ఆ రెండు బొండాలూ సూపర్‌మేన్ కొట్టేసి నీళ్ళు తాగాడని ఆవిడ ఆరోపణట.

ఇది విన్నాక సూపర్‌మాన్ ఒళ్ళు మండిపోయింది. పనిలేకపోతే పస్తుంటాం గానీ ఇలా పక్కింటి వాళ్ళ కొబ్బరి బొండాలు తస్కరించే అలవాటు మా ఇంటా వంటా లేదని రివ్వున లేచి వాళ్ళ కొబ్బరిచెట్టుని బలంగా అవతలి దొడ్లోకి నెట్టేశాడు. ఇప్పుడది స్ట్రెయిట్‌గా నిలబడింది. ఇంకోసారి ఊసెత్తితే మర్యాదగా వుండదని పక్కింటి వాళ్ళకు చెప్పమని వార్నింగిచ్చాడు పనిమనిషికి.

ఈ ఫీట్ చూసి పక్కింటి వాళ్ళ అబ్బాయే ఓ ఆరేళ్ళ కుర్రాడు చప్పట్లు కొట్టాడు.

"సూపర్‌మేన్ అంకుల్! భలే భలే... మా కొబ్బరి చెట్టు పీసా టవర్‌లా వుండేది. ఇప్పుడు ఎంత చక్కగా నిలబడిందో" అని గంతులేశాడు.

ఆ కుర్రాడి మాటలు విన్నాక సూపర్‌మాన్‌కి అప్పుడనిపించింది. ఊరికే ప్రొడ్యూసర్లని నమ్ముకుని కూర్చునే కంటే నాలుగు మంచి పనులు చేస్తే ప్రజలకీ మేలు జరుగుతుంది. తనకీ ఏదో చేశానన్న తృప్తి మిగులుతుంది అనుకుని మర్నాడే ఇటలీ బయలుదేరాడు- పీసా నగరానికి.

సూపర్‌మాన్ పీసా టవర్ చేరుకునే సరికి కొన్ని వందల మంది టూరిస్టులు వున్నారక్కడ. చాలా సందడిగా వుంది. ఒక్క ఉదుటున గాలిలోకి లేచి బలమంతా ఉపయోగించి వంకరగా వున్న టవర్‌ని నెమ్మదిగా కదిపాడు. అది కరకరమంటూ పెద్ద శబ్దం చేస్తూ కదిలి నిటారుగా నిలబడింది.

టూరిస్టుల చప్పట్లతో ఆ ప్రదేశం మారు మోగిపోయింది. తిరిగి భూమి మీదకు దిగిన సూపర్‌మేన్‌ని అంతా చుట్టుముట్టారు. పిల్లా పెద్దా అంతా ఆటోగ్రాఫులు తీసుకున్నారు. సూపర్‌మాన్‌కి చాలా ఆనందంగా వుంది. ఇంతమంది అభిమానులున్నారా తనకి?

ఓ బుజ్జి కుర్రాడు మారం చేస్తూంటే వాణ్ణి వీపు మీద ఎక్కించుకుని గాలిలో గోపురం చుట్టూ నాలుగు రౌండ్లు కొట్టి వచ్చాడు. ఆ కుర్రాడు కిందకి దిగి- "అమ్మా మన కారమ్మేద్దామే ... సూపర్‌మాన్‌ని తీసుకుపోదాం మనింటికి..." అంటూ మారాం చెయ్యసాగాడు.

"ష్... తప్పు... అలా అనకూడదు" అని వాళ్ళ అమ్మ మందలిస్తూంటే ఆ సంభాషణ విననట్టు తల పక్కకి తిప్పు కున్నాడు.

ఇంతలో దూరంగా నాలుగు జీపులు, రెండు వాన్లు, నాలుగు మోటారు సైకిళ్ళు వచ్చి ఆగాయి. ఒక చిన్న సైజు ఆర్మీ ప్లటూన్ దిగింది. కమాండర్ బూట్లు టకటక లాడించుకుంటూ వచ్చి, 'మీరేనా సూపర్‌మాన్' అని అడిగాడు.

అవునన్నాడు సూపర్‌మాన్.

"ఈ టవర్‌ని వంకర తీసింది మీరేనా?" అడిగాడు మళ్ళీ.

అవునన్నాడు సూపర్‌మాన్.

మిమ్మల్ని ప్రెసిడెంటు తీసుకురమ్మన్నారు" అన్నాడు కమాండర్.

సూపర్‌మాన్ చిరునవ్వుతో టూరిస్టుల దగ్గర వీడ్కోలు తీసుకుని హర్షధ్వానాల మధ్య ఇటలీ ప్రెసిడెంటు దగ్గరకి బయల్దేరాడు- ఆర్మీ ఎస్కార్ట్‌తో.

ప్రెసిడెంట్ తన ఛాంబర్‌లో పచార్లు చేస్తున్నాడు. సూపర్‌మాన్ రాగానే- "సో... యూ డిడిట్" అన్నాడు.

"యస్..." అన్నాడు చిరునవ్వుతో సూపర్‌మాన్.

సన్మానం చేస్తానంటాడేమో! గోల్డ్ మెడల్ ఇస్తానంటాడేమో? తాను మర్యాదగా తిరస్కరించాలి. ఈ సన్మానాలూ దండాలూ తనకిష్టం లేదనీ, విశ్వ మానవుడిగా తన ధర్మం తాను నిర్వర్తించానని హుందాగా, మర్యాదగా చెప్పాలి.

"బుద్ధుందా నీకు? ఎవరి పర్మిషన్‌తో ఈ పని చేశావు?" గర్జించాడాయన.

సూపర్‌మాన్ అదిరిపడ్డాడు. ఇదేవిటి ఇలాగంటాడీయన? ఇవ్వాళో రేపో కూలిపోయేట్లున్న టవర్‌ని సరిగ్గా నిలబెడితే ఇలా తిడతాడేమిటి?

"కానీ...!" సూపర్‌మాన్ ఏదో చెప్పబోయాడు.

"కానీ లేదు సెన్నీ లేదు. పీసా టవర్ గరిమనాభి తప్పి ఒంకరగా వుండబట్టే, కొన్ని లక్షల మంది టూరిస్టులు వచ్చి వెడుతున్నారు. ఇప్పుడు ఇంక ఎవరొస్తారు? ఎన్ని మిలియన్ డాలర్ల ఫారిన్ ఎక్స్ఛేంజి మాకు నష్టమో తెలుసా?" అరిచాడాయన.

నిజమే అనిపించింది సూపర్‌మాన్‌కి.

"అయామ్ సారీ... ఏదో... మంచిపని చేద్దామని ఆవేశంలో... ఇలా జరిగింది. యూడోంట్ వర్రీసార్. ఇప్పుడే వెళ్ళి మళ్ళీ దాన్ని ఒంకరగా జరిపి వస్తాను" అని లేవబోయాడు.

"ఇదేం మారుతీ కారు గేర్ రాడ్ అనుకున్నావా నీ ఇష్టం వచ్చినట్లు తిప్పడానికి? చేసిన నిర్వాకం చాల్లే. మళ్ళీ గనుక దాన్ని జరిపితే పునాదులతో సహా కూలిపోతుంది" అని పక్కనే వున్న ఇంజనీర్ల బృందం వేపు చూశాడు. వాళ్ళు అవునన్నట్లు తలూపారు.

సూపర్‌మాన్ మనసు వికలమయింది. తల వంచుకుని అలాగే నిల్చున్నాడు.

ప్రెసిడెంటుకి కొంచెం జాలేసింది.

"ఇట్స్ ఆల్ రైట్. యూ కెన్ గో" అన్నాడు. సూపర్‌మాన్ భారంగా లేచి బయటకు వచ్చేశాడు.

ఓ నెల గడిచింది.

అప్పుడే భోంచేసి విశ్రాంతిగా పడక్కుర్చీలో వాలి, ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు సూపర్‌మాన్. వార్తలొస్తున్నయ్. 'ఇప్పుడే అందిన వార్త' అని చెప్పగానే చెవులు

ప్రసన్న కుమార్ సర్రాజు

రిక్కించుకున్నాడు.

"మాస్కోలో రచయితలు, సైంటిస్టులు, మేధావులు ఎక్కిన విమానం పది నిముషాల క్రితం హైజాక్ చేయబడింది. ఇప్పటి వరకూ ప్రయాణీకులంతా సురక్షితంగానే వున్నారు. సైన్స్ అండ్ కల్చరల్ కాన్ఫరెన్స్‌కి మాస్కో నుండి లెనిన్‌గ్రాడ్ వెడుతున్న విమానంలో వున్న మాట యాభై ఎనిమిది మందీ సోవియెట్ మేధావులే. ఇతర దేశాలకు చెందిన ప్రయాణీకులెవరూ లేరు. హైజాకింగ్‌కి కారణం తెలీదు. హైజాకర్స్ ఏమి కోరతారో కూడా చెప్పలేని స్థితిలో వున్నామని సోవియెట్ అధికార ప్రతినిధి ఒకరు అన్నారు..."

అంతే... సూపర్ మాన్‌కి విశ్వ మానవుడిగా తన కర్తవ్యం గుర్తుకొచ్చింది. చటుక్కున లేచి చకచకా డ్రస్ చేసుకుని ధ్వని వేగంతో రష్యా బయలుదేరాడు.

విమానం ఇంకాసేపట్లో రష్యా దేశ పరిహద్దులు దాటబోతుందనగా వెళ్ళి పట్టుకున్నాడు. విమానం రెక్కకి కాసేపు వ్రేలాడి ఎలాగో లోపలికి ప్రవేశించాడు. పిస్టల్ పట్టుకు నిల్చుని పాప్‌కారన్ తింటున్నాడు ఒక దుండగుడు. ఒకే ఒక గుద్దుతో వాణ్ణి మట్టి కరిపించాడు. చప్పుడు కాకుండా కాక్‌పిట్‌లో ప్రవేశించి పైలట్ తలకి రివాల్వర్ గురి పెట్టి నిల్చున్న ఇంకో హైజాకర్‌ని వెనుక నుంచీ మెడ మీద ఒక్కటిచ్చాడు. వాడు కిక్కురు మనకుండా కింది పడిపోయాడు.

పైలట్స్ సూపర్‌మాన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. హైజాకర్స్ విమానాన్ని దేశ పరిహద్దులు దాటించమని డిమాండ్ చేశారని, సమయానికి మీరొచ్చి కాపాడారని పరి పరి విధాల కృతజ్ఞతలు తెలిపారు.

విమానాన్ని వెనక్కు తిప్పి మాస్కోలో దింపారు క్షేమంగా.

విమానం రన్‌వే మీద దిగగానే సూపర్ మాన్ డోర్ దగ్గరకెళ్ళి నిల్చున్నాడు. ప్రయాణీకులందరూ తనని కావలించుకుని ముద్దు పెట్టుకుంటారని, వారి అభినందనలు, కృతజ్ఞతలూ స్వీకరించటానికి సిద్ధంగా చిరునవ్వుతో నిల్చున్నాడు.

విమానం ఆగగానే ప్రయాణీకులంతా ఉసూరు మంటూ లేచారు. దిగే ముందు

"తమరేనా మమ్మల్ని కాపాడింది? గొప్ప పని చేశార్లే" అని ఒకరు

"మీ కింకేం పనీ పాటా లేదా? ఎందుకు మీకు సంబంధించని విషయాల్లో [illegible]క్యం చేసుకుంటారు" అని ఇంకొకరు-

"మొన్న ఇటలీలో గూడా ఇలా పీసా గోపురం వంకర తీశాట్ట. ఇప్పటికీ కో[illegible] కోలా వాళ్ళు. సిగ్గు లేకపోతే సరి" అని ఒ[illegible]డా-

"మొహం చూడు మొహం" అని ఇంకొకావిడా-

ఒకమ్మాయ్ అయితే 'థూ' అని [illegible]మ్మేసి మరీ దిగింది విమానం.

సూపర్‌మేన్ మొహం క[illegible]గడ్డ అయింది.

'ఏమిటి నా జాతకం? హైజాకర్స్‌ని దండించి ప్రయాణీకుల్ని కాపాడడం కూడా తప్పేనా?' అనుకున్నాడు.


చివరగా ఒక ఎయిర్‌హోస్టెస్ దిగుతూ చెప్పింది-

"బాధ పడకండి. మీరు మంచే చేద్దామనుకుని చేశారు. ఒక్కోసారి అలా ఎదురు తిరుగుతూంటుంది" అని మెట్లు దిగుతుంటే..

'కానీ... ఎందుకు వీళ్ళంతా నన్నిలా తిడుతున్నారో మీ కయినా తెలిస్తే చెప్తారా?' అడిగాడు సూపర్‌మేన్- కళ్ళవీళ్ళు గిర్రున తిరుగుతుండగా.

ఎయిర్ హోస్టెస్ ఆగి ఒకసారి అటూ ఇటూ చూసింది. తరువాత ఒక మెట్టు ఎక్కి సూపర్‌మేన్‌కి మాత్రమే వినపడేటట్లు చెప్పింది.

"ఎందుకంటే ఈ మేధావులంతా తలా కాస్త చందాలేసుకుని హైజాకర్స్‌ని కుదుర్చుకున్నారు" అని చెప్పి వడి వడిగా దిగి




వెళ్ళిపోయింది.

* * *

సూపర్‌మేన్ ఇంతవరకూ చెప్పి ఆగాడు. ఆసామీ హృదయం ద్రవించింది. 'బాధపడకండి. మంచివాళ్ళకే కష్టాలు' అన్నాడు ఓదార్పుగా.

బామ్మర్ది టీ తెప్పించాడు. ముగ్గురూ టీ తాగుతూండగా "మరి ఇండియా ఎలా వచ్చారు?" అడిగాడు బామ్మర్ది.

"ఇండియా ఖర్మ భూమి అని ఎవరో చెప్పారు" అన్నాడు సూపర్‌మాన్.

"ఖర్మభూమికాదు. కర్మభూమి" బామ్మర్ది దిద్దాడు.

"అదేలెండి... నా తెలుగు అంతంత మాత్రం. ఇక్కడి జనం చాలా మంచి వాళ్ళనీ, ఇక్కడ ప్రశాంతత దొరుకుతుందనీ హాలీవుడ్‌లో ఇల్లు ఖాళీచేసి ఇండియా వచ్చేశాను. ఇండియాలో నాకు తెలిసిన సిటీ బొంబాయి ఒక్కటే. బొంబాయిమీదుగా వస్తూంటే కిందకి చూస్తే జనం హడావుడిగా పరుగెత్తుతున్నారు. దుకాణదారులు చకచకా షట్టర్స్ వేసేసి లోపలే దాక్కుంటున్నారు. పది నిముషాలలో ఆ రోడ్డంతా నిర్మానుష్యమైపోయింది. కిందకి దిగి చాటుగా వుండి చూస్తే నాకర్థమయింది ఆ సమయంలో బొంబాయి నగరాన్ని పరిపాలించే రెండు పెద్ద మాఫియా గ్యాంగులు యుద్ధానికి తలబడబోతున్నాయని. అటు పాతిక కార్లు, ఇటు ముప్తై కార్లు వచ్చి ఆగాయి. బిలబిలమంటూ దిగి ఇరుపక్షాలవాళ్ళూ కాల్పులు జరపడానికి సిద్ధంగా వున్నారు. చుట్టుపట్ల చూస్తే ఒక్క పోలీసువాడూ లేడు. కొంతమంది సివిలియన్స్ మాత్రం మేడలమీదా మిద్దెలమీద నిలబడి తొంగి చూస్తున్నారు.

మనకెందుకులే గొడవ పోదామా అనుకున్నా అంత ఘోరంగా రక్తపాతం జరగబోతూంటే దానిని ఆపడం విశ్వ మానవుడిగా నా కనీస ధర్మం అనుకుని రెండు గ్రూపుల మధ్యకీ వెళ్ళి నచ్చ చెప్పాను. మొదట వినలేదు. ఒకళ్ళిద్దరు అడ్డు తప్పుకో అంటూ నామీద రివాల్వర్లు పేల్చారు. ఈ పిస్తోలు గుళ్ళు నన్నేం చేస్తాయి? వాళ్ళిద్దర్నీ మెడలు పట్టుకుని చెరో డాబామీదకి విసిరేశాను.

అంతే, 5 నిమిషాలలో ఇరుపక్షాలూ కార్లెక్కేసి ఎవరిదోవన వాళ్ళు పారిపోయారు. చెప్పండి, నేనుచేసింది తప్పంటారా?"

"తర్వాతేం జరిగింది?" అడిగాడు ఆసామీ.

"మాఫియా గ్యాంగులు పారిపోగానే మిద్దెలమీద వుండి చూస్తున్న వాళ్ళు కిందకి దిగి వచ్చి నన్ను నానా విధాల దూషించారు. వాళ్ళంతా మఫ్టీలో వున్న పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, డిఎస్పీలట. "ఇరుపక్షాలవాళ్ళూ కొట్టుకు చచ్చి బొంబాయి మాఫియాపీడ విరగడవుతుందని మేం కాచుకు కూర్చుంటే నువ్వెవడివయ్యా పానకంలో పుడకలా దాపురించావ్" అని తిట్టారు. నాకు విరక్తి కలిగి సిటీలు వద్దూ, సివిలిజేషన్లూ వద్దు అని ఆంధ్రాకొచ్చాను పచ్చటి పల్లెటూళ్ళలో బతుకుదామని. ఇక్కడికి ఓ యాభై మైళ్ళ దూరంలో రెండు గ్రామాలు పక్క పక్కనే వున్నాయ్. ఆ రెండు గ్రామాలనీ కలుపుతూ ఒక బ్రిడ్జి వుంది. నా ఖర్మకాలి ఓ రోజు అటేపే వస్తున్నాను. ఆ సమయంలో బ్రిడ్జి కింద బాంబులు పెట్టి ఎవరో దుండగులు ఆ బ్రిడ్జిని కూలగొట్టడానికి సిద్ధంగా వున్నారు. వన్ టూ త్రీ చెప్పి ఆ బాంబులన్నిటినీ ఒకేసారి ఫ్యూజ్ చెయ్య బోతున్నాడు ఒక దుర్మార్గుడు.

ఎగిరే కాలూ, తిట్టే నోరూ వూరుకోవంటారు. క్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు. వాడిమీదకి దిగి మాడుమీద ఒక్కటిచ్చాను. వాడు వెర్రిగా అరిచాడు. వెంటనే ముందు జాగ్రత్తగా వైర్లన్నీ తెంపేశాను. వెంటనే వాడి తాలూకా నలుగురు మనుష్యులు కమ్ముకున్నారు నన్ను. ఆపకుండా తన్నాను వాళ్ళందర్నీ. వాళ్ళందరూ తెలుగులో ఏదో అరుస్తూ — అప్పటికి నాకు మీ భాష రాదుగా — చొక్కాలు దులుపుకుని జీపెక్కి వెళ్ళిపోయారు కోపంగా.

వెంటనే ఇరు పక్కల గ్రామాల వాళ్ళూ ఎలా వచ్చారో బిలబిలమంటూ వచ్చారు. వస్తూనే నన్ను ఛెడామడా తిట్టడం మొదలెట్టారు.

కొంతమంది "సార్! సార్" అని అరుస్తూ పరుగెత్తి దుండగుల జీపును ఆపడానికి ప్రయత్నించారు. అప్పటికే జీపెళ్ళిపోయింది.

ఇంతకూ విషయమేమింటే ఆ బ్రిడ్జి ఇవాళో రేపో కూలిపోయే దశలో వుందట. దాన్ని పడగొట్టి కొత్త బ్రిడ్జి కట్టించమని మూడేళ్ళ నించీ విన్నపాలు పంపుకుంటే ఫైల్ను కదిలి ఇప్పటికి వచ్చారుట గవర్నమెంటు ఇంజనీర్లు. నేనేమో తెలీక వాళ్ళని తన్ని పంపించానాయే. ఇక మళ్ళీ వాళ్ళని బతిమలాడి, కాళ్ళు పట్టుకుని రప్పించడానికి ఎంత ఖర్చవుతుందో, ఎంత కాలం పడుతుందో అని ఒకళ్ళిద్దరు ముసలాళ్ళు కన్నీళ్ళు కూడా పెట్టుకున్నారు. నేను అనేక విధాల వాళ్ళని క్షమించమని అడిగి, ఇక మంచి పనుల జోలికి ఛస్తే పోనని ఒట్టేసుకుని, ఇదిగో ఇక్కడ ఇలా బతుకుతున్నాను—" సూపర్‌మేన్ చెప్పడం ముగించాడు.

ఆసామి, బామ్మర్ది లేచి సూపర్ మాన్‌ని భుజం తట్టారు.

"మీరేం బాధపడకండి. మేం మీతో పిక్చరు తీస్తాం. అది గ్రాండ్ సక్సెస్ అవుతుంది" అన్నారు.

"థ్యాంక్యూ వెరీమచ్! మరి కథ రెడీగా వుందా?" అడిగాడు సూపర్ మాన్ హీరో హోదాలో.

"ఇంకేదో కథ ఎందుకూ? ఈ కథే తీద్దాం" అన్నాడు ఆసామి.

బామ్మర్ది ఆసామి వేపు మెచ్చుకోలుగా చూశాడు.